క్లుప్తంగా

అందుబాటులో చిల్లర నాణేలు

కోడుమూరు రూరల్: కోడుమూరు ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకులో చిరు వ్యాపారుల కోసం రూపాయి, రెండు రూపాయల నాణేలను అందుబాటులో ఉంచినట్లు మేనేజర్ సుదర్శన్ రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. చిల్లర నాణేలు అవసరమైన చిరు వ్యాపారస్తులు ఏపీజీబీ బ్యాంకులో సంప్రదించి పొందవచ్చని సూచించారు.

పనులు నాణ్యతగా చేపట్టాలి



బ్యాతోలిలో డ్రైన్ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఏఈ గోనేనాయక్

సి.బెళగల్: గ్రామాల్లో జరుగుతున్న మురికి కాలువలు, పైపులైన్ల నిర్మాణాలను నాణ్యతగా చేపట్టాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ గోనేనాయక్ సూచించారు. ఆయన గురువారం మండలంలోని సి.బెళగల్, బ్యాతోలి గ్రామాల్లో పర్యటించి, అక్కడ జరుగుతున్న నిర్మాణాలను పరిశీలించారు. బ్యాతోలి గ్రామంలో రూ.6 లక్షల మండల పరిషత్ నిధులతో చేపట్టిన మురికినీటి కాలువ నిర్మాణాన్ని పరిశీలించి కూలీలకు పలు సూచనలు చేశారు. అదేవిధంగా సి.బెళగల్‌లో జరుగుతున్న నీటి ట్యాంక్ నిర్మాణాన్ని ఏఈ పరిశీలించారు.

డేటా అనెలిటిక్స్ వర్క్ షాప్

కల్లూరు: దూపాడు సమీపంలోని కేవీ సుబ్బారెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో డేటా అనెలిటిక్స్ వర్క్ షాప్ కార్యక్రమం గురువారం కళాశాల చైర్మన్ కేవీ సుబ్బారెడ్డి ప్రారంభించారు. ప్రముఖ సాఫ్ట్‌వేర్ శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో ఐదు రోజుల పాటు నిర్వహించనున్న డేటా అనెలిటిక్స్ వర్క్ షాప్ ద్వారా విద్యార్థులకు డేటా అనెలిటిక్స్, పవర్ బీఐ శిక్షణతో పాటు సర్టిఫికెట్స్ ఇవ్వడం జరుగుతుందని చైర్మన్ తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్, అధ్యాపకులు రిషప్ ప్రైవేట్ లిమిటెడ్ సిబ్బంది పాల్గొన్నారు.

పొలాల్లోకి దూసుకెళ్లిన కారు

పాణ్యం : మండల కేంద్రమైన పాణ్యంలోని నూలుమిల్లు వద్ద జాతీయ రహదారిపై వర్షం కారణంగా ఓ కారు రోడ్డు దిగి పొలాల్లోకి దూసుకెళ్లింది. గురువారం నంద్యాలకు చెందిన దంత వైద్యుడు సాయి కర్నూలుకు వెళ్తుండగా వర్షం కారణంగా కారు అదుపుతప్పి పక్కనే ఉన్న పొలాల్లోకి వెళ్లింది. ఈ ఘటనలో కారులో ఉన్న వారికి ఎలాంటి గాయాలు కాలేదు. సమాచారం అందుకున్న హైవే పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని కారును బయటకి తీశారు.

ఆర్‌జీఎం ప్రిన్సిపాల్‌కు అవార్డు



అవార్డు అందుకుంటున్న ప్రిన్సిపాల్ జయచంద్రప్రసాద్

పాణ్యం: మండల పరిధిలోని నెరవాడ మెట్ట వద్ద ఉన్న ఆర్జీఎం ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ జయచంద్రప్రసాద్ జాతీయ స్థాయిలో ప్రతి ఏటా అఖిల భారత మండలి ఏఐసీటీఈ నిర్వహించే ఎడ్యుకేషనల్ ఎక్స్‌లెంట్ అవార్డుకు ఎంపికయ్యారని డీన్ అశోక్ గురువారం తెలిపారు. జాతీయ స్థాయిలో ఏడవ స్థానంలో కళాశాల ఇంటర్న్‌షిప్ లభిందించదన్నారు. నేషనల్ బోర్డు అక్రిడిషేన్ మాజీ చెర్మన్ కేకే. అగర్వాల్ చేతుల మీదుగా అవార్డును ప్రిన్సిపాల్ జయచంద్రప్రసాద్ అందుకున్నారన్నారు. చైర్మన్ శాంతిరాముడు, సిబ్బంది ఆయనను అభినందించారు.

ఉపాధి పథకంలో క్షేత్ర సహాయకులే కీలకం

కర్నూలు (రూరల్): ఉపాధి హామీ పథకంలో గ్రామస్థాయి ఫీల్డ్ అసిస్టెంట్లదే కీలకపాత్ర ఉంటుందని డ్వామా ఏపీడీలు పద్మావతి, కృష్ణ మోహన్ అన్నారు. గురువారం కర్నూలు మండల ప్రజాపరిషత్ మీటింగ్ హాల్‌లో కర్నూలు క్లస్టర్ పరిధిలోని ఐదు మండలాలు క్రిష్ణగిరి, ఓర్వకల్లు, వెల్దుర్తి, కల్లూరు, కర్నూలు గ్రామాలకు చెందిన ఫీల్డ్ అసిస్టెంట్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టే పండ్ల తోట పెంపకం, కూలీలకు హాజరు నమోదు నూతన ప్రక్రియను వివరించారు. ఉపాధి అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

గాలికుంటు వ్యాధిని నివారిద్దాం

గడివేముల: పశువులకు గాలికుంటు వ్యాధి సోకకుండా నివారిద్దామని పశుసంవర్ధకశాఖ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాసరావు అన్నారు. గురువారం మండల పరిధిలోని బిలకలగూడూరు గ్రామంలో గాలికుంటు వ్యాధి టీకా కార్యక్రమాన్ని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ పశువులకు గాలికుంటు వ్యాధి సోకకుండా సంవత్సరానికి రెండుసార్లు ప్రభుత్వమే ఉచితంగా టీకా అందిస్తుందన్నారు. పాడి రైతులు తమ పశువులకు గాలికుంటు వ్యాధి సోకకుండా టీకాలు వేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏడీ డాక్టర్ సుబ్బారెడ్డి, డాక్టర్ పావని, ఎల్ఎస్ఏ ఇస్మాయిల్, సాదిక్, ఏహెచ్ఏ గుణశేఖర్, ఉమ్మడి జిల్లా డైరెక్టర్ యుగంధర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సార్బీసీ పొలాల్లో గ్రావెల్ దొంగలు



ఎస్సార్బీసీ పొలాల్లో గ్రావెల్ కోసం తవ్వగా ఏర్పడ్డ గుంతలు



గుంతలో నీటి ఊట వచ్చిన దృశ్యం

- భారీగా మట్టి అక్రమ తవ్వకాలు
- గుంతలు ఏర్పడి నీటి ఊటలు వస్తున్న వైనం
- రోజుకు పదుల సంఖ్యలో టిప్పర్ల తరలింపు
- పట్టించుకోని ఎస్సార్బీసీ అధికారులు

పాణ్యం: మండల పరిధిలోని తమ్మరాజుపల్లె గ్రామంలో ఎస్సార్బీసీకి చెందిన పొలాల్లో అక్రమంగా గ్రావెల్ తవ్వకాలు చేపట్టి తరలిస్తున్నారు. అధికారులకు తెలిసినా పట్టీపట్టనట్లు వ్యవహిస్తున్నారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

90 ఎకరాల భూసేకరణ

1992 సంవత్సరంలో శ్రీశైలం కుడిగట్టు కాల్వ (ఎస్సార్బీసీ) అవసరాల కోసం దాదాపుగా గ్రామంలోని 90 ఎకరాల వరకు భూమిని సేకరించారు. రైతులకు పరిహారం అందించి వాటిలో మట్టి తవ్వి కాల్వ నిర్మాణానికి ఉపయోగించారు. అయితే సేకరించిన పొలాల్లో అవసరమైన మేరకే అధికారులు మట్టిని తీసుకొని మిగిలినది అలాగే వదిలేశారు. ఇదే అదునుగా చేసుకున్న గ్రావెల్ దొంగలు రాత్రింబవళ్లు భారీ యంత్రాల సహాయంతో ఆయా పొలాల్లో తవ్వకాలు చేపడుతున్నారు. టిప్పర్లతో గ్రావెల్‌ను తరలించి విక్రయిస్తున్నారు. దీంతో ఆ పొలాల్లో భారీగా గుంతలు పడి నీటి ఊటలు ప్రారంభమయ్యాయి. అయినా వదలకుండా నిర్వహకులు రోజు పదుల సంఖ్యలో టిప్పర్లతో గ్రావెల్‌ను నంద్యాల చుట్టు పక్కల గ్రామాలకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు.

కన్నెత్తి చూడని అధికారులు

గ్రామంలో ఎస్సార్బీసీ పొలాల్లో గ్రావెల్ కోసం భారీ యంత్రాలతో తవ్వుతున్నప్పటికీ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. కనీసం ఆటువైపు కన్నెత్తి కూడా చూడకపోవడంపై పలు సందేహాలు వ్యక్తమవుతున్నాయి. భూగర్భజలాలు బయటికి వచ్చేలా గుంతలు తవ్వడంతో ప్రమాదాలకు నిలయంగా మారుతున్నాయి. గతంలో గ్రావెల్ కోసం తవ్విన గుంతలో ఈతకోసం వెళ్లి యువకులు మృతిచెందిన ఘటనలు ఉన్నాయి. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకొని ఎస్సార్బీసీ పొలాల్లో గ్రావెల్ తరలిస్తున్న అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

శాస్త్రీయ పద్ధతులు పాటించాలి



జి.సింగవరంలో పత్తి పంటను పరిశీలిస్తున్న డీఏఓ పి.వరలక్ష్మి, వ్యవసాయాధికారులు

కర్నూలు(రూరల్): అధిక దిగుబడి, నాణ్యమైన విత్తన ఉత్పత్తి కోసం రైతులు శాస్త్రీయ పద్ధతులు పాటించాలని జిల్లా వ్యవసాయాధికారి (డీఏఓ) పి.వరలక్ష్మి సూచించారు. ఆమె గురువారం వ్యవసాయ సహాయ సంచాలకుడు వరదన్ రెడ్డితో కలిసి మండల పరిధిలోని ఎదురూరు గ్రామంలో ఉన్న రాష్ట్ర విత్తనోత్పత్తి క్షేత్రాన్ని పరిశీలించారు. పంటల పెరుగుదల, విత్తనోత్పత్తి కార్యకలాపాలను సమీక్షించి సాంకేతిక సిబ్బందితో చర్చించారు. అనంతరం జి.సింగవరం గ్రామాన్ని సందర్శించి రైతులతో సమావేశమై పలు సూచనలు చేశారు. ఉల్లి పంట కాలం 110 రోజులు పూర్తయిన తర్వాతే కోతలు చేపట్టాలని సూచించారు. ఉల్లిగడ్డలను సరైన పద్ధతిలో గ్రేడింగ్ చేసి ఆరబెట్టిన తరువాతనే మార్కెటు యార్డ్‌కు తరలించాలన్నారు. వ్యవసాయ శాఖ తరఫున రైతులకు సాంకేతిక సలహాలు, నాణ్యమైన ఇన్‌పుట్లు, మార్కెటింగ్ సౌకర్యం కల్పిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం ఈ క్రాప్ నమోదు ఎంతమేర పూర్తి చేశారని గ్రామ సచివాలయ అగ్రికల్చర్ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. పంట నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. వ్యవసాయ అధికారులు శ్రీనివాసులు, రామక్రిష్ణ ఉన్నారు.

కష్టపడినవారికి గుర్తింపు



కాటసాని రాంభూపాల్‌రెడ్డిని పూలమాలతో సత్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కల్లూరు: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో కష్టపడిన వారందరికి తప్పనిసరిగా పదవులు వరిస్తాయని ఆ పార్టీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర గ్రీవెన్స్ సెల్ సెక్రటరీగా నియమితులైన బి. బాలగంగాధర్ గురువారం కాటసాని రాంభూపాల్‌రెడ్డిని ఆయన స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలిసి పూలమాలతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. కాటసాని రాంభూపాల్‌రెడ్డి మాట్లాడుతూ పార్టీలో పదవులు పొందిన వారందరూ పార్టీ మరింత బలోపేతానికి కృషి చేయాలన్నారు. కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

స్థల వివాదంలో సర్పంచ్ భర్త దాడి



ఫిర్యాదు చేసిన వారిపై చెయ్యి చేసుకుంటున్న క్రిష్ణాయాదవ్

కర్నూలు(రూరల్): స్థల వివాదంలో సర్పంచ్ భర్త ఇద్దరిపై చెయ్యి చేసుకున్నాడు. మండల పరిధిలోని పంచలింగాల స్కంద వెంచర్ 42 ఎకరాల్లో దాదాపు 180 కుటుంబాలు నివశిస్తున్నాయి. వెంచర్‌లో అభివృద్ధికి కేటాయించిన స్థలం 1.80 సెంట్లు ఆక్రమణకు గురవుతోందని ఒక వర్గం వారు గత వారం పీజీఆర్ఎస్‌లో జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఇదే విషయంపై గతంలో లోకాయుక్తను ఆశ్రయించినట్లు సమాచారం. ఈ క్రమంలో గురువారం ఉదయం పంచలింగాల సర్పంచ్ మాధవి, భర్త క్రిష్టాయాదవ్ ఆ స్థలంలో పూజా కార్యక్రమాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసుకుంటుండగా సదరు వర్గం వారు రెవెన్యూ, పోలీస్, పంచాయతీ అధికారులకు ఫిర్యాదు చేశారు. స్పందించిన అధికారులు వివాదాస్పద స్థలంలో పూజా కార్యక్రమం విరమించుకోవాలని సూచించారు. దీంతో ఆగ్రహానికి గురైన సర్పంచ్ భర్త క్రిష్ణయాదవ్, రఫీ ఫిర్యాదుదారులైన ప్రసాద్, మజీద్‌లపై చెయ్యి చేసుకున్నారు. దీనిపై బాధితులు కర్నూలు అర్బన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. స్థల పంచాయితీ స్టేషన్‌కు చేరడంతో పోలీసులు, రెవెన్యూ, గ్రామ పంచాయతీ అధికారులు అక్కడికి చేరుకుని అందరినీ బయటకు పంపి గేటుకు తాళం వేసి సమస్య సద్దుమణిగేలా చేశారు.

ఎల్లమ్మ హుండీ ఆదాయం లెక్కింపు



కానుకల లెక్కింపును పరిశీలిస్తున్న ఆలయ ఈఓ

కర్నూలు(రూరల్): వెంకాయపల్లె ఎల్లమ్మ ఆలయంలో హుండీ ఆదాయాన్ని గురువారం లెక్కించారు. ఆలయ మండపం వద్ద తాలుకా అర్బన్ పోలీస్ సిబ్బంది, గ్రామ పెద్దల సమక్షంలో అధికారుల అధ్వర్యంలో లెక్కింపు చేపట్టగా శ్రీదేవ సేవా సంస్థ వారు పాల్గొన్నారు. ఆలయ హుండీల్లో భక్తులు సమర్పించిన కానుకల ద్వారా మొత్తం రూ.14,44,284 ఆదాయం వచ్చినట్టు కార్యనిర్వహణ అధికారి ఎ.రాధాక్రిష్ణ తెలిపారు. పర్యవేక్షణ అధికారి చంద్రశేఖర్ రెడ్డి, గార్గేయపురం ఏపీజీబీ బ్రాంచ్ మేనేజర్ అన్వర్, అర్చకులు చిన్నయ్య, నారాయణ, యల్లారాజు, బాలు, దేవదాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

అఖండ జ్ఞానమే ముక్తికి మార్గం



మాట్లాడుతున్న హయగ్రీవచార్యులు

పాణ్యం: అఖండ జ్ఞానమే ముక్తికి ఏకైక మార్గమని భారతీయ ఇతిహాసాలు, పురాణాలు, వేదాలు, ఉపనిషత్తులన్నీ ఏకాత్మతా భావనను పెంచుతున్నాయని ప్రముఖ ధార్మిక ప్రవచకులు తి.తి.దే వ్యాఖ్యాత డాక్టర్ హయగ్రీవాచార్యులు అన్నారు. గురువారం తొగర్చేడు గ్రామంలోని శ్రీ వేణుగోపాలస్వామి ఆలయంలో ధార్మిక కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ శ్రీమద్రామాయణంపై సుదీర్ఘ ప్రవచనం చేశామన్నారు. ప్రతి ఒక్కరూ మన దేశ సంస్కృతి తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా హిందూధర్మ పరిషత్ కార్యనిర్వహకులు మల్లు వెంకట్‌రెడ్డి, సర్పంచ్ శ్రీనివాసరెడ్డి, రామకృష్ణారెడ్డి, రామాంజినేయరెడ్డి, బాలసుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జీవనశైలి మార్చుకోవాలి



వైద్య సేవలను పరిశీలిస్తున్న అసంక్రమిత వ్యాధుల నియంత్రణ అధికారి డాక్టర్ మహేశ్వర ప్రసాద్

కల్లూరు: కొన్ని రకాల వ్యాధులు రాకుండా ఉండాలంటే జీవనశైలిని మార్చుకోక తప్పదని అసంక్రమిత వ్యాధుల నియంత్రణ అధికారి డాక్టర్ మహేశ్వర ప్రసాద్ సూచించారు. గురువారం పర్ల గ్రామంలో సంచార చికిత్స కార్యక్రమాన్ని పరిశీలించి, అక్కడ అందిస్తున్న వైద్య సేవలను గురించి అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ మధుమేహం రావడానికి ప్రధాన కారణం వంశపారపర్యం లేదా మానసిక ఒత్తిడి, వృత్తిపరమైన ఒత్తిడి అన్నారు. అలాగే తరచూ జంక్ ఫుడ్ తినడం, వ్యాయామం లేకపోవడం, శారీరక శ్రమ చేయలేక పోవడమన్నారు. కార్యక్రమంలో వైద్యులు శ్రీదేవి, ఫ్లోరోసిస్ కన్సల్టెంట్ సుధాకర్, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి విద్యార్థి పాఠశాలలో భోజనం చేయాలి



భోజనాన్ని పరిశీలిస్తున్న జీసీడీఓ సువర్చలా

పాణ్యం : ప్రభుత్వ పాఠశాలలో అందించే డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనాన్ని ప్రతి విద్యార్థి తప్పకుండా తినాలని జీసీడీఓ సువర్చలా అన్నారు. గురువారం పాణ్యంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ కాలం చెల్లిన వస్తువులను వంటకు ఉపయోగించరాదన్నారు. అలాగే కూరగాయలు, వస్తువులను సిబ్బంది పదేపదే పరిశీలించి వంటకు ఉపయోగించాలన్నారు. ప్రతి విద్యార్థి పాఠశాలలో భోజనం చేసేలా రుచికరంగా వండాలని సూచించారు. అనంతరం భోజనం తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఎంఈఓ-2 సుబ్రమణ్యం, సిబ్బంది పాల్గొన్నారు.

పారిశుద్ధ్యం లోపిస్తే చర్యలు

కల్లూరు: గ్రామాల్లో పారిశుద్ధ్యం లోపిస్తే పంచాయతీ కార్యదర్శులపై చర్యలు తప్పవని డీఎల్‌డీఓ రమణారెడ్డి హెచ్చరించారు. గురువారం పుసులూరు గ్రామంలో జరుగుతున్న పారిశుద్ధ్య పనులను డీఎల్‌డీఓ, ఎంపీడీఓ నాగేశ్వరరెడ్డి పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఎక్కడ పడితే అక్కడ చెత్త వేయకుండా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. పారిశుద్ధ్య కార్మికులు (క్లాప్ మిత్రలు)తడి చెత్త, పొడి చెత్త వేరువేరుగా సేకరించాలని సూచించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రతి ఒక్కరూ ఇంటితో పాటు పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు.



పనులు పరిశీలిస్తున్న డీఎల్‌డీఓ వి.రమణారెడ్డి

గోరుకల్లును సందర్శించిన కలెక్టర్



జలాశయం వివరాలు అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్

పాణ్యం : మండల పరిధిలోని గోరుకల్లు జలాశయాన్ని నంద్యాల జిల్లా కలెక్టర్ రాజకుమారి గనియా సందర్శించారు. గురువారం పాణ్యం డొంగు-దుర్వేశి మెట్ట వరకు దాదాపు 13 కిలోమీటర్ల దూరం వరకు రూ. 6.29కోట్ల డీఎంఎఫ్ నిధులతో వేసిన బీటీ రోడ్డును పరిశీలించారు. అలాగే గోరుకల్లు జలాశయం కట్ట ఇటీవల కుంగిపోవడంతో మరమ్మతులకు రూ. 2.50కోట్ల డీఎంఎఫ్ నిధులతో చేపట్టబోవు పనులపై ఎస్ఈ సుభకుమార్ అడిగి తెలుసుకున్నారు. గోరుకల్లు జలాశయంలో నీటి నిల్వ పెంచి తాగు, సాగు నీటిని అందించేందుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో డీఈఈలు జ్యోతి, గీతావాణి, కడా ఈఈ కిష్టన్న, ఏఈఈలు రాహుల్, అమృత్ తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

- పోలకల్, సి.బెళగల్ పీహెచ్‌సీలను తనిఖీ చేసిన డీఎంహెచ్‌ఓ
- వైద్య అధికారులపై మండిపాటు
- ప్రజలకు అందుబాటులో లేకుంటే చర్యలు తప్పవని హెచ్చరిక



పోలకల్ విలేజ్ క్లీనిక్‌ను తనిఖీ చేస్తున్న డీఎంహెచ్‌ఓ శాంతికళ

సి.బెళగల్: గ్రామాల్లో సీజనల్ వ్యాధుల పట్ల వైద్య అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని డీఎంహెచ్‌ఓ శాంతికళ ఆదేశించారు. ఆమె గురువారం జిల్లా మలేరియా అధికారి నూకరాజుతో కలిసి మండలంలో పర్యటించి, పోలకల్, సీ.బెళగల్ పీహెచ్‌సీలు, పోలకల్ విలేజ్ హెల్త్ క్లినిక్‌ను అకస్మికంగా తనిఖీ చేశారు. పోలకల్ పీహెచ్‌సీ పరిసరాల్లో పిచ్చి మొక్కలు ఉండటాన్ని గమనించి వైద్య అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. శుభ్రంగా ఉంచాలని వైద్యాధికారులు శ్రావణి, అనీస్‌లను ఆదేశించారు. పీహెచ్‌సీ రక్షణ గోడ ఎత్తు తక్కువగా ఉండటంతో రాత్రి వేళ కొందరు గోడ దూకి వస్తున్నారని, తాము ఒంటరిగా విధులు నిర్వహించేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, రక్షణ గోడ ఎత్తు పెంచడంతో పాటు, వాచ్‌మన్‌ను ఏర్పాటు చేయాలని వైద్య సిబ్బంది డీఎంహెచ్‌ఓను కోరారు. అనంతరం గ్రామంలో విలేజ్ క్లినిక్‌ను తనిఖీ చేసి గ్రామస్తులకు అందుతున్న వైద్య సేవలు, నమోదవుతున్న వ్యాధులు, మందుల సరఫరా రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామ సచివాలయం – 2 పరిధిలో పంచాయతీ ద్వారా సరఫరా అవుతున్న మంచినీటి శ్యాంపిల్స్ సేకరించి, నీటి పరీక్షల నిమిత్తం కర్నూలుకు తీసుకెళ్లారు. సి.బెళగల్ పీహెచ్‌సీలో వైద్య సిబ్బంది హాజరు, నమోదవుతున్న కేసుల వివరాలను డాక్టర్ మిథున్‌కుమార్ రెడ్డిని అడిగి తెలుసుకున్నారు. డాక్టర్లు, వైద్య సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలని, గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండి సీజనల్ వ్యాధులపై ప్రజలను అప్రమత్తం చేయాలని ఆదేశించారు.

ఉల్లికి మద్దతు ధర కొనసాగుతుంది



ఉల్లి దిగుబడులను పరిశీలిస్తున్న ఆర్డీఓ సందీప్‌కుమార్

కోడుమూరు రూరల్: ఏడాది పొడవునా ఉల్లి పంటకు ప్రభుత్వం మద్దతు ధర కల్పిస్తుందని కర్నూలు ఆర్డీఓ సందీప్‌కుమార్ రైతులకు సూచించారు. గురువారం మండలంలోని వర్కూరు గ్రామంలో ఆర్డీఓ సందీప్‌కుమార్, తహసీల్దార్ నాగరాజు పర్యటించి ఉల్లి పొలాలను పరిశీలించి రైతులతో మాట్లాడారు. ఆర్డీఓ మాట్లాడుతూ.. ప్రభుత్వం ఉల్లి క్వింటాల్‌కు రూ.1200 మద్దతు ధర ప్రకటించిందని, ఈ ధర ఏడాది పొడవునా ఉంటుందన్నారు. రైతులు తొందరపడి ముందుగానే ఉల్లి కోతలు చేపట్టకుండా, పంటకాలం పూర్తయిన తర్వాతే ఉల్లి కోతలు చేపట్టి దిగుబడులను గ్రేడింగ్ చేసిన తర్వాతే మార్కెట్‌కు తరలించాలని సూచించారు. అలాగే ఈనెల 18, 19 తేదీల్లో కర్నూలు మార్కెట్ యార్డుకు సెలవు ప్రకటించడం జరిగిందని, రైతులెవ్వరూ ఉల్లి దిగుబడులను మార్కెట్‌కు తీసుకురావొద్దని ఆర్డీఓ సూచించారు. అంతకుముందు ఖరీఫ్ కింద నమోదు చేసిన పంట నమోదును ఆర్డీఓ క్రాస్ చెక్ చేశారు. ఆయా గ్రామాల వీఆర్వోలు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఇద్దరు బైక్ దొంగల అరెస్ట్



పోలీసుల అదుపులో నిందితులు

డోన్ టౌన్: జల్సాలకు అలవాటు పడి బైక్ దొంగతనాలకు పాల్పడుతున్న ఇద్దరిని పట్టుకుని, వారి వద్ద నుంచి రెండు ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు రూరల్ సీఐ రాకేష్ తెలిపారు. గురువారం కొట్లవారిపల్లె వద్ద ఎస్ఐ మమతతో కలిసి వాహన తనిఖీలు జరుపుతున్న సమయంలో బేతంచెర్ల నుంచి డోన్ వైపు వస్తున్న ఇద్దరు పోలీసులను చూడగానే బైకులను వదిలి పారిపోగా, సిబ్బంది వెంబడించి వారిని అదుపులోకి తీసుకున్నారు. విచారణలో నిందితులు ఓర్వకల్లు మండలం బైరెడ్డినగర్‌కు చెందిన పరుతం జంగం శంకర్, ఓర్వకల్లు మండలం బైరాపురం గ్రామానికి చెందిన బొగ్గుల రవి (ప్రస్తుతం బేతంచెర్లలోని శేషారెడ్డినగర్‌లో నివాసం) అని గుర్తించారు. వీరిద్దరూ కొంతలపాడు గ్రామంలో పొలం పనుల సమయంలో పరిచయం పెంచుకుని, ఆ తర్వాత జల్సాలకు అలవాటు పడి రద్దీ ప్రదేశాల్లో బైకులను దొంగలించి, గుర్తు తెలియని వ్యక్తులకు విక్రయిస్తూ వచ్చిన డబ్బుతో విలాస జీవితం గడిపినట్లు తెలిపారు. ఈ నెల 15న చిన్నమల్కాపురం రైల్వే స్టేషన్‌లో ఒక బైక్, హైదరాబాద్‌లో మరో బైక్‌ను చోరీ చేసినట్లు ఒప్పుకున్నారని సీఐ తెలిపారు. దాడుల్లో ఏఎస్ఐ గోపాల్, హెడ్ కానిస్టేబుల్స్ నాగేష్, మద్దిలేటి, రవికుమార్ పాల్గొన్నారు.



గోరంట్లలో అధ్వానంగా ఉన్న అనుగొండ పాత రస్తా



వర్షాలకు బురదమయంగా మారిన దారి

దారి ఇలా.. నడిచేది ఎలా?

మండలంలోని గ్రామంలో చినుకు పడితే చాలు వీధులన్నీ బురదమయంగా మారుతున్నాయి. ముఖ్యంగా గోరంట్లలోని అనుగొండకు వెళ్లే పాత రస్తా మొత్తం బురదమయంగా మారి ప్రజలు అడుగు తీసి అడుగు వేయలేని పరిస్థితికి చేరుకుంది. బురదమయంగా మారిన దారిలో తమ ఇండ్లకు చేరుకునేందుకు ప్రజలు నిత్యం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా అధ్వానంగా ఉన్న దారిలో చిన్నారులు, వృద్ధులు నడవలేక ఇళ్లలోనే ఉండిపోవాల్సి వస్తోంది. ఇక పగలు ఎలాగోలా నడిచి వెళ్లినా రాత్రి సమయాల్లో బురదమయంగా ఉన్న దారిలో విషపురుగులు సైతం సంచరిస్తుండడంతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి తమ ఇండ్లకు వెళ్లేందుకు మట్టి రోడ్డునైనా నిర్మించాలంటూ ముక్తకంఠంతో కోరుతున్నారు.

– కోడుమూరు రూరల్

వైఎస్సార్‌సీపీ నాయకుడికి పరామర్శ



వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు తిరుపంరెడ్డి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుంటున్న కాటసాని రాంభూపాల్ రెడ్డి

గడివేముల: మండల పరిధిలోని కొరటమద్ది గ్రామ సర్పంచ్ నాగేశ్వర రెడ్డి తండ్రి, సీనియర్ వైఎస్సార్‌సీపీ నాయకుడు మాజీ సర్పంచ్ తిరుపం రెడ్డి గత కొన్ని రోజుల నుంచి అనారోగ్యంతో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న పాణ్యం మాజీ ఎమ్మెల్యే, నంద్యాల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్ రెడ్డి గురువారం ఆయన స్వగృహానికి చేరుకుని పరామర్శించారు. తిరుపంరెడ్డి ప్రస్తుత ఆరోగ్య పరిస్థితిని కుటుంబసభ్యులను అడిగితెలుసుకున్నారు. కార్యక్రమంలో నాయకులు పాణ్యం మాజీ జెడ్పీటీసీ సూర్య నారాయణ రెడ్డి, మాజీ సర్పంచ్ కృష్ణారెడ్డి, మాజీ భోగేశ్వరాలయం చైర్మన్లు సునీల్‌కుమార్‌రెడ్డి, గోపాలయ్య, వైఎస్సార్‌సీపీ నాయకులు భాస్కర్ రెడ్డి, రఘుమాధవ రెడ్డి, ,అనిల్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.